కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- సీడీపీవో జి.శాంతకుమారి
- లింగారావుపాలెం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం



కొత్త నేర చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతకుమారి

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు సీడీపీవో జి.శాంతకుమారి తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన నేర చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు అమలులో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్‌ను కేంద్రం భారత న్యాయ సంహితగా మార్చిందన్నారు. ఇందులోని నూతన చట్టాలను గురించి విద్యార్థులు, పౌరులు తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు.

భారతీయ న్యాయ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు చట్టాల్ని రూపొందించి జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. అలాగే మహిళలు, పిల్లలు, తమ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి, పోలీస్ స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి అనే విషయాలను గురించి అవగాహన కల్పించారు. జీవో ఎఫ్ఐఆర్, 1098, 181 ద్వారా ఫిర్యాదు చేయడం, బాల్య వివాహాలు, పిల్లలు, మహిళలు వారు చదువుకునే చోట, పనిచేసే ప్రాంతాల్లో తోటి వారితో ఎదుర్కొనే సమస్యలు వాటి పరిష్కారాలను గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే వారు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. డీసీపీవో ఎం శౌరి మాట్లాడుతూ విద్యాభ్యాసం బాలల హక్కు అని 14 ఏళ్లలోపు వారంతా బడిలోనే ఉండాలన్నారు. బాలల సమస్యల పరిష్కారానికి 1098కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయవాది ప్రశాంతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని, అవి చట్టరీత్యా చెల్లవన్నారు. ఆ వివాహాలు చేసిన, ప్రోత్సహించిన, హాజరైన వారందరూ శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నిర్మలరాణి, సెక్టార్ సూపర్‌వైజర్లు ఎం.జోజమ్మ, కె వెంకట రమణ, మహిళా పోలీస్ సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పున్నమ్మ, బి.సుధారాణి, అనురాధ, పాఠశాల హెచ్ఎం కేవీ రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

బొల్లాపల్లి: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు, మేళ్లవాగు జెడ్పీ హైస్కూల్స్ విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, షేక్ మస్తాన్‌బీలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో చట్టాలను మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన చట్టాలను రూపొందించి అమలులోకి తెచ్చిందని చెప్పారు. ఆయా చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బ్రిటీష్ కాలంలోని చట్టాలను మారుస్తూ భారతీయ న్యాయ సంహిత (2023), భారతీయ నాగరిక సురక్ష సంహిత (2023), భారతీయ సాక్ష్య అధినీయం (2023) రూపొందించి ఈ నెల ప్రారంభం నుంచి అమలులోకి తెచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మనంపాడు హైస్కూల్ హెచ్ఎం కె.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

క్లుప్తంగా

కోదండ రాముడికి జన్మనక్షత్ర పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువై యున్న శ్రీ కోదండ రామాలయంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దర్భి ఉమామహేశ్వరశర్మ, అనిల్ కుమార్‌లు స్వామివార్లను జలాభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు గోత్రనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



చిలకలూరిపేట: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి అని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి చెప్పారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి జనసంఘ్ నేటి బీజేపీగా రూపాంతరం చెందిందని చెప్పారు. నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పొత్తూరి బ్రహ్మానందం, నియోజకవర్గ కో కన్వీనర్ మల్లెల శివనాగేశ్వరరావు, నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, పులగుజ్జు మహేష్, ఉప్పాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామారావు



చిలకలూరిపేట: పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నరసరావుపేట పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు చెప్పారు. చిలకలూరిపేట ఏరియా పశువైద్యశాలలో అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలను శనివారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామారావు పెంపుడు జంతువులు, పాడి పశువుల గురించి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా 202 పెంపుడు కుక్కలు, వివిధ రకాల పిల్లులకు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో నరసరావుపేట, చిలకలూరిపేట పశువైద్యశాలల అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ ఎస్‌సీహెచ్ నరసింహులు, డాక్టర్ టి.శ్రీనివాసరావు, పశువైద్యులు డాక్టర్ పి.దీప్తి,సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించాలి



నరసరావుపేట రూరల్: పెంపుడు కుక్కలకు తప్పకుండా యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం ప్రభుత్వ జంతు వైద్యశాలలో ఉచితంగా పలు జంతువులకు వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా రేబీస్ వ్యాక్సిన్‌పై అవగాహన కోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఉపసంచాలకులు పి.రామారావు, పశువ్యాధి నిర్ధారణ కేంద్ర సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.కళావతి, పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు డాక్టర్ సీ.హెచ్.నరసింహులు, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ సేవలు దేశానికే ఆదర్శం

పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొలేష్



బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పొలేషన్

వినుకొండ(నూజెండ్ల): డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ సేవలు దేశానికే ఆదర్శమని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పొలేష్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక నరసరావుపేట రోడ్డులోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి రక్షణ కోసం బాబుజగ్జీవన్‌రామ్ ఎన్నో చట్టాలకు జీవం పోశారని అన్నారు. భారత ఉప ప్రధానిగా ఆయన చేసేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పిడుగు విజయ్‌బాబు, రవికుమార్, రమేష్, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

పండుగలను వైభవంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి, మొహరం పండుగలను వైభవంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ అత్యంత వైభవంగా జరపాలని, భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. మొహరం, తొలి ఏకాదశి పండుగలు ఒకే రోజు రావడం విశేషమన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పురప్రముఖులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ తలతోటి రాణి

- ఎంపీపీ తలతోటి రాణి
- సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై చర్చ

నాదెండ్ల: వర్షాకాల సమయంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ తలతోటి రాణి సభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం కావడంతో పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు అభినందనలు తెలిపారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఎండుగుంపాలెం గ్రామంలో ఏడాది నుంచి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు రావటం లేదని, గ్రామంలో గతంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి అనుమతులొచ్చాయని, అయినా నిర్మాణ పనులు చేపట్టలేదని, చెరువులో పూడిక తీయాలని ఎంపీటీసీ సూరె సరస్వతి అధికారుల దృష్టికి తెచ్చారు. హౌసింగ్ ఏఈ నరేంద్ర స్పందించి మాట్లాడుతూ, బిల్లుల మంజూరు ప్రక్రియ జరుగుతున్నదన్నారు. ఇర్లపాడు ఉపసర్పంచ్ రంగనాథుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఉందని, ఇక్కడ ఒకే బోరు ఉండటంతో విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, మండల పరిషత్ నిధులతో విద్యుత్ మోటారు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. దీనిపై ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ స్పందిస్తూ పంచాయతీ తీర్మానం ఇచ్చినట్లయితే మోటారు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఎంఈవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం మండల పరిధిలో నేను బడికి పోతా కార్యక్రమం సాగుతున్నదని, ఇప్పటి వరకూ ఒకటో తరగతిలో 320 మంది చిన్నారులను చేర్చుకున్నామ న్నారు. ఉన్నత పాఠశాలలో ఆరోతరగతిలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, కొత్త ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలు రావాల్సి ఉందన్నారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే దామాషా ప్రకారం గ్రామాలకు కేటాయిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



యడ్లపాడు: బైక్ అదుపు తప్పి ఫోర్‌వీల్ ఆటోను ఢీకొన్న సంఘటనలో ఇద్దరికీ గాయాలైన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యడ్లపాడు చెందిన పి.సతీష్‌బాబు, షేక్ చాన్‌షా బైక్‌పై సర్వీసు మార్గంలో యడ్లపాడు వైపు వస్తుండగా అదుపు తప్పింది. దీంతో అదే మార్గంలో వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్‌బాబు, చాన్‌షా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లోంచి రూ.35 వేల నగదు, ఏటీఎం కార్డు కింద పడిపోయాయి. స్థానికుల సమాచారంతో రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిలో లభించిన నగదు, ఏటీఎంలను పోలీసులకు అప్పగించారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



చిలకలూరిపేట: పల్నాడు జిల్లా కౌలురైతు సంఘం అధ్యక్షుడు కామినేని రామారావుపై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని పండరీపురంలో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని చెప్పినప్పటికీ అలా కొనసాగటం లేదని ప్రశ్నించిన రామారావుపై దాడికి పాల్పడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి విల్సన్ మాట్లాడుతూ ఒకపక్క పవన్ కళ్యాణ్ ప్రశ్నించకపోతే ఎట్లా అని మాట్లాడుతున్న సమయంలో వరిగడ్డచర్లలో టీడీపీ నాయకుల ఇంట్లో పింఛన్లు పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకాలని, రామారావుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

డాక్టర్ వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించుకుందాం

నాయకులు, కార్యకర్తలకు సూచించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఈనెల 8న పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సారథి వైఎస్సార్ అన్నారు. ఆరోగ్యశ్రీ, 108 లాంటి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేశారన్నారు. జయంతి సందర్భంగా విగ్రహాలకు పూలదండలు వేసి అన్నదానాలు, రక్తదానం, ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు, రొట్టెల పంపిణీ లాంటివి చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ మార్గంలో నడుస్తూ గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండదండలుగా ఉండాలన్నారు. మళ్లీ 2029లో పార్టీని అధికారంలోకి తీసుకురావటమే ధ్యేయంగా పనిచేయాలని, మనస్పర్థలను పక్కన పెట్టి సంయుక్తగా కృషి చేయాలని కోరారు.

సమావేశంలో ముదిరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం స్వామి, కందుల ఎజ్రా, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, బత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మొక్కలు నాటుతున్న శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల: రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యటించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం హయాంలో అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామన్నారు. అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తహసీల్దారు కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ఈ విధంగా మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం దగ్గర ఉండటం వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారికి ఇబ్బంది ఉండదన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన తహసీల్దారు కార్యాలయాన్ని శాసనసభ్యులు ప్రారంభించారు. ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఉషారాణి, ఎండీఓ సీహెచ్ లక్ష్మీకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య, కార్యదర్శి పల్లెల నాగిరెడ్డి, టీడీపీ మండల నాయకులు మాజీ ఎంపీపీ ఎం. రామారావు, గడిపూడి నరసింహారావు, రాంశెట్టి కోటయ్య, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి క్రీడలు ఎంతో కీలకం

నరసరావుపేట: ప్రజారోగ్య సంరక్షణకు కీలకంగా ఉండే క్రీడా కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణాన్ని అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని, శారీరకంగా, మానసికంగా ఉత్తేజంగా ఉంచేవి క్రీడలు మాత్రమేనన్నారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనలో ఉదాసీనంగా వ్యవహరించొద్దన్నారు.

జగజ్జీవనరాం జీవితం అందరికీ ఆదర్శం

దళిత ఉద్యమ నాయకుడు, జాతి హక్కుల కోసం నిరంతరం శ్రమించిన శ్రామికుడు డాక్టర్ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ బకాయి లు వెంటనే చెల్లించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యావ్యవస్థలో బోధనేతర పనుల భారం తగ్గించాలన్నారు. మున్సిపాలిటీల్లో జూనియర్ కాలేజీ (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేయాలని, అర్బన్ ఎంఈవోలుగా మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎంలకు అవకాశం కల్పించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యావ్యవస్థతో మార్పులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, ఇనకొల్లు అంకమ్మరావు పాల్గొన్నారు.

బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్

నరసరావుపేట ఈస్ట్: పాఠశాలలో బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నూతన ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని, పీఎఫ్ ఖాతాలను తెరవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేసే 117 జీఓను రద్దు చేయాలన్నారు. కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఆడిట్ సభ్యుడు ఆంజనేయులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.

దొప్పలపూడి మృతి తీరని లోటు



యడ్లపాడు: ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ జీఓల పట్ల తనకున్న అవగాహన ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉపాధ్యాయులకు విశేష సేవలందించిన సేవాతత్పరుడు దొప్పలపూడి దేవరత్నం అని పలువురు కొనియాడారు. అనారోగ్యంతో ఆకస్మికంగా దేవరత్నం మృతి చెందడం బాధాకరమని పల్నాడు జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ సంపత్ బాబు, సెక్రటరీ వి.అశోక్‌లు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసే నిబద్ధత గల ఉపాధ్యాయుడు అని దేవరత్నంను కొనిడాయారు. ఆయన మృతి విద్యా రంగానికే గాక ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని అన్నారు. పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, ఫ్యాప్టో పల్నాడు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.

విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం



రొంపిచర్ల: విద్యుదాఘాతంతో గృహంలోని వస్తువులన్నీ దగ్ధమైన సంఘటన మండలంలోని అన్నవరప్పాడు కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఎం.చిన కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు రాత్రి వేళ ఇంటిలో నిద్రిస్తున్నారు. నిద్రిస్తున్న సమయంలో గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వచ్చాయి. మంటలు రావటంతో నిద్రిస్తున్నవారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో గృహంలోని విలువైన వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.